ప్రజాశక్తి
గురువారం 6 మార్చి 2025 | 5 | శ్రీసత్యసాయి





స్థూపం వద్ద నివాళులు అర్పిస్తున్న సిపిఎం నాయకులు

అరెస్టా.. విచారణా..?



- మాధవ్ పరిస్థితి ఏంటో.. ?
- నేడు సైబర్ పోలీసుల ఎదుట విచారణకు హాజరు
- మద్దతుదారులతో బయలుదేరిన మాజీ ఎంపి మాధవ్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

హిందూపురం మాజీ ఎంపి గోరంట్ల మాధవ్‌ను పోలీసులు అరెస్టు చేస్తారా, లేక విచారించి పంపుతారా అన్నదానిపై సర్వత్రా చర్చ నడుస్తోంది. గోరంట్ల మాధవ్‌కు విజయవాడ సైబర్ పోలీసులు ఈనెల ఐదవ తేదీన విచారణకు హాజరుకావాలని నోటీసులిచ్చారు. ఈ నోటీసులు అందుకున్న ఆయన 5వ తేది కాకుండా ఒక రోజు అదనంగా గడువు అడిగి బుధవారం నాడు విజయవాడకు బయలుదేరి వెళ్లారు. వెళ్లే ముందు మీడియాతోనూ మాట్లాడి వెళ్లారు. ప్రతిపక్ష నాయకులపై అనవసరమైన కేసులు పెడితే తిరుగుబాటు తప్పదని చెప్పారు. ప్రభుత్వం దాన్ని చవిచూడక తప్పదని హెచ్చరించారు. చట్టాన్ని గౌరవించే వ్యక్తిగా తాను పోలీసు విచారణకు హాజరవుతున్నట్టు కూడా చెప్పారు. ఒక యువతి అత్యాచారం కేసులో ఆమె పేరును ప్రస్తావించడం నేరమని మాజీ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మాధవ్‌పై చర్యలకు ఉపక్రమించారు. గురువారం నాడు ఆయన విచారణకు హాజరుకానున్నారు. ఈ విచారణ అనంతరం ఆయన్ను అరెస్టు చేస్తారా లేక విచారించి పంపిస్తారా అన్న దానిపై చర్చ నడుస్తోంది. ఇప్పటికే రాష్ట్రంలో పలువురు వైసిపి నాయకుల అరెస్టులు జరిగాయి. ఇప్పుడు మాధవ్‌ను కూడా చేస్తారా లేదా అన్నది రాజకీయవర్గాలు గమనిస్తున్నాయి. వైసిపి అధికారంలో ఉన్న సమయంలో గోరంట్ల మాధవ్ అప్పటి ప్రతిపక్ష పార్టీ నాయకులపై తీవ్ర స్థాయిలోనే వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని కూడా దుర్భషలాడారు. ఈ నేపథ్యంలో ఆయనపై తెలుగుదేశం పార్టీ దృష్టి సారించినట్టు తెలుస్తోంది.

దూకుడుకు కళ్లెమేసేరా..?

పోలీసు అధికారిగానున్న గోరంట్ల మాధవ్ 2019 ఎన్నికల చివరి నిమిషంలో వైసిపిలో చేరారు. ఆయనకు హిందూపురం పార్లమెంటు టిక్కెట్టును ఖరారు చేశారు. వైసిపి గాలిలో ఆయన విజయం సాధించారు. ముందు నుంచి దూకుడుగా ఉండే గోరంట్ల మాధవ్ ఎంపి అయిన తరువాత కూడా తెలుగుదేశం పార్టీపై తనదైన శైలిలో విమర్శలు చేస్తూ వచ్చేవారు. ఒక మహిళతో న్యూడ్‌గా వీడియో కాల్‌లో మాట్లాడే వీడియో ఒకటి బయటకు వచ్చింది. అది ఆయనను రాజకీయంగా కొంత దెబ్బతీసింది. ఈ నేపథ్యంలో 2024 ఎన్నికల్లో ఆయనకు టిక్కెట్టు ఇవ్వలేదు. ఈ ఎన్నికల్లో వైసిపి పూర్తిగా దెబ్బతీనడంతో ఆయన రాష్ట్ర అధికార ప్రతినిధి బాధ్యతలను పార్టీ అప్పగించింది. ఇప్పుడు ఆయనపై కేసులు నమోదవడం జరిగింది. ఆయన్ను ఈ కేసుల్లో జైలుకు పంపుతారా లేక విచారించి పంపిస్తారా అన్నది చర్చ నడుస్తోంది. ఆయన మాత్రం కేసులు పెట్టినా ఎదుర్కొంటామని చెబుతున్నారు.

కామ్రేడ్ బడా సుబ్బిరెడ్డి పోరాటాలు

వామపక్ష ఉద్యమానికి స్ఫూర్తి

- ఎర్రజెండా ఉన్నంతకాలం ఆయన గుర్తుంటారు..
- రైతుల గుండెల్లో చిరస్మరణీయుడు
- కామ్రేడ్ సుబ్బిరెడ్డి స్మారక స్థూపం ఆవిష్కరణలో సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-కదిరి టౌన్

కామ్రేడ్ బడా సుబ్బిరెడ్డి పోరాటాలు రైతు, కార్మిక, వామపక్ష ఉద్యమానికి స్ఫూర్తిగా నిలుస్తాయని సిపిఎం నాయకులు కొనియాడారు. శ్రీసత్యసాయి జిల్లా ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బడా సుబ్బిరెడ్డి ఇటీవల కన్నుమూశారు. సుబ్బిరెడ్డి స్వగ్రామం కదిరి మండలం వరిగిరెడ్డిపల్లిలో ఆయన స్మారక స్థూపాన్ని నిర్మించారు. బుధవారం నాడు కుటుంబ సభ్యులతో కలిసి సిపిఎం నాయకులు స్థూపాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు ప్రధాన వక్తలుగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్, ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, సిపిఎం సీనియర్ నాయకులు జి.ఓబులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కామ్రేడ్ సుబ్బిరెడ్డి తొలుత పాల ఉత్పత్తిదారుల సంఘం నుంచి ఉద్యమ పోరాటంలోకి వచ్చారన్నారు. తర్వాత రైతుసంఘం, సిపిఎంలో రైతులు, కూలీలు, కార్మికుల పక్షాన నాలుగు దశాబ్దాల పాటు అనేక పోరాటాలు సాగించారన్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రైతాంగం సాగించిన అనేక పోరాటాల్లో సుబ్బిరెడ్డి అగ్రభాగాన నిలిచారని తెలిపారు. కదిరి ప్రాంతంలో చెర్లోపల్లి రిజర్వాయర్ నిర్వాసితుల పక్షాన సుదీర్ఘ పోరాటం చేశారన్నారు. హంద్రీనీవా సుజల స్రవంతి పథకం పూర్తి చేసి కదిరి ప్రాంతంలోని అన్ని చెరువులకు నీరు ఇవ్వాలని రైతులతో సంఘటితం చేసి ఉద్యమాలు నిర్మించారన్నారు. సిపిఎం ఆధ్వర్యంలో గంజి కేంద్రాలు ఏర్పాటు చేసిన సమయంలో వాటిని పూర్తి స్థాయిలో విజయవంతం చేసేందుకు కృషి చేశారన్నారు. పట్టు పరిశ్రమ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై గ్రామగ్రామాన తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారని గుర్తు చేశారు. ఎన్‌పి.కుంట సోలార్ ప్రాజెక్టు కోసం రైతుల నుంచి భూసేకరణ చేసినప్పుడు పరిహారం, పునరావాసం కోసం సాగించిన పోరాటంలో సుబ్బిరెడ్డి ముందుండి ఆందోళనలు సాగించారన్నారు. ప్రజా పోరాటాలతో ఆయనకున్న బంధం విడదీయలేదని చెప్పారు. ఎర్రజెండా ఉన్నంత వరకు కామ్రేడ్ సుబ్బిరెడ్డి పోరాటాలు సజీవంగా నిలుస్తాయన్నారు. రైతులు, కార్మికులు, ప్రజల పక్షాన ప్రజా పోరాటాలు నిర్వహించడమే ఆయనకు ఇచ్చే నివాళి అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అడ్వకేట్ నరసింహులు, అన్నదాత రామిరెడ్డి, రామకృష్ణ, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జంగాలపల్లి పెద్దన్న, లక్ష్మీనారాయణ, జిఎల్.నరసింహులు, రైతు సంఘం నాయకులు హరి, కదిరప్ప, ప్రవీణ్ కుమార్, నాగిరెడ్డి, రమణ, శివన్న, వినోద్‌కుమార్, రాజారెడ్డి, ఐద్వా మహిళా సంఘం నాయకురాలు శాంతిబాయి, మున్నీ, రమీజా, అంగన్వాడీ యూనియన్ నాయకులు మాబున్నీసా, సుశీల, సిపిఎం నాయకులు బాబ్జాన్, జగన్మోహన్, ముస్తాక్, సాంబ, రామ్మోహన్, ప్రజాసంఘాల నాయకులు వేమన్న, ఆటో పెద్దన్న, రఫిక్, తిరుపాల్, బాలకృష్ణ, ఆంజనేయులు, రాజగోపాల్, పెడబల్లి బాబా, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి, రాంభూపాల్, ఓబులు

వివాదాస్పద భూముల రిజిస్టర్‌లో సర్వేనెంబర్లు నమోదు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి- చిలమత్తూరు

'నష్టపరిహారాన్ని కాజేసేందుకు కుట్ర' అన్న శీర్షికతో బుధవారం ప్రజాశక్తి లో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. 544-జి జాతీయ రహదారి కోసం చాగలేరు పొలంలోని 111,112-2,126-2 సర్వేనెంబర్లలో భూమిని ప్రభుత్వం సేకరించింది. అయితే ఈ సర్వే నెంబర్లపై కోర్టు లో కేసు నడుస్తుండటంతో అప్పటికే వాటిని వివాదస్పద భూమిగా 1 బి లో నమోదు చేశారు. అయితే ఇటివలే వాటిని వివాదస్పద భూమి నుండి తొలిగించి . 1 బి ని అన్ లాక్ చేశారు. దీనిపై బాదితులు తమకు వచ్చే నష్టపరిహారాన్ని కాజేసేందుకు రెవెన్యూ అదికారులు అన్‌లాక్ చేశారని ఆందోళన వ్యక్తం చేస్తూ తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. అయితే అధికారులు స్పందించకపోవటంతో బాధితులు 'ప్రజాశక్తి'ని ఆశ్రయించారు. ఈ విషయంపై ప్రజాశక్తి దినపత్రికలో బుధవారం కథనం రావడంతో జాయింట్ కలెక్టర్ స్పందించారు. వెంటనే ఆ సర్వేనెంబర్లను డిస్ప్యూట్ రిజిస్టర్ లో నమోదు చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. దీంతో ఆ సర్వే నెంబర్లకు వివాదాస్పద భూమిరిజిస్టర్ లో నమోదు చేశారు. దీంతో బాధితులు 'ప్రజాశక్తి' కి కృతజ్ఞతలు తెలిపారు

నాటుసారా అనర్థాలపై కళాజాత : కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

నాటుసారా వద్దు ఆరోగ్యమే ముద్దు కళాజాత బందం అన్ని గ్రామాల్లో ప్రచార కార్యక్రమాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని కలెక్టర్ టిఎస్.చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో కళాజాత బందం ప్రచార రథాన్ని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నాటుసారాను నిర్మూలించడానికి నవోదయం 2.0 కార్యక్రమాన్ని రూపొందించిందన్నారు. నాటుసారా వల్ల జరిగే అనర్థాలను ఆరోగ్యాలు పాడు కావడం తదితర అంశాలపై కళాజాత బందం ప్రజలకు వివరించి వారిలో చైతన్యం తీసుకురావడమే ప్రధాన ఉద్దేశం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ జిల్లా అధికారి గోవింద నాయక్, సిఐలు నరసింహులు, నాగరాజు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



కళాజాత ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ చేతన్

మహిళా దినోత్సవాలను ఘనంగా నిర్వహిద్దాం

ఈనెల 8వ తేదీన జిల్లా వ్యాప్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ టిఎస్.చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లో రాష్ట్ర మహిళా శిశుసంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్‌తో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఐసిడిఎస్, మెప్మా, స్కిల్ డెవలప్మెంట్ ఇతర ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించాలని ఆదేశించారు. ఎక్కడ ఎలాంటి పొరపాట్లు జరగకుండా సంబంధిత అధికారులందరూ సమన్వయంతో పని చేయాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు అందరినీ ఆహ్వానించాలన్నారు. మహిళా రక్షణకు శక్తి యాప్‌ను రూపొందించాలని అందుకు పోలీస్ సహకారం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ సుధా వరలక్ష్మి, డిఆర్‌డిఎ ప్రతినిధి లలిత, మెప్మా ప్రతినిధి రమాదేవి, స్కిల్ డెవలప్మెంట్ హరి కిరణ్, పరిశ్రమల శాఖ జిఎం.నాగరాజు పాల్గొన్నారు.

నేడు తాడిమర్రికి సిపిఎం రాష్ట్ర నాయకులు

ప్రజాశక్తి - తాడిమర్రి

మండల పరిధిలోని దాడి తోట, పెద్దకోట్ల, చిల్ల కొండయ్య పల్లి గ్రామ సరిహద్దుల్లో ఏర్పాటు చేస్తున్న ఆదాని హైడల్ పవర్‌ప్రాజెక్టు వల్ల రైతులకు కలుగుతున్న నష్టాలను పరిశీలించడానికి సిపిఎం రాష్ట్ర, జిల్లా నాయకులు గురువారం గ్రామంలో పర్యటించనున్నట్లు స్థానిక నాయకులు తెలిపారు. ప్రాజెక్ట్ నిర్మాణం చేపడుతున్న క్రమంలో అక్కడ నిల్వ ఉంచుతున్నటువంటి మట్టి కుప్పల వల్ల, రాళ్ళను విచ్చిన్నం చేయడం ద్వారా వచ్చే దుమ్ము వల్ల దాడితోట గ్రామానికి చెందిన రైతుల చీనీ, అరటి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతోందన్నారు. అలాగే చిల్ల కొండాయపల్లి పరిధిలో దాదాపుగా 120 బోర్లు ఒక్కసారిగా అడుగంటి పోయాయన్నారు. దీంతో వేల ఎకరాల పంట పొలాలను ఎండిపోయే పరిస్థితి ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఈ నష్టపోయిన రైతులను పరామర్శించి, వారి సమస్యలను తెలుసుకోవడానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి. రాంభూపాల్, రైతుసంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న తదితరులు గురువారం తాడిమర్రి మండలంలో పర్యటించనున్నారని చెప్పారు.

పిఆర్‌సి ప్రకటించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి- చిలమత్తూరు

పిఆర్‌సిని వెంటనే ప్రకటించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శెట్టిపి జయచంద్రారెడ్డి, ఎం. సుధాకర్ డిమాండ్ చేశారు. బుధవారం చిలమత్తూరు మండల యు.టి.ఎఫ్. కార్యవర్గం ఏర్పాటు చేసిన మండల సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి ఈ నెల 12 నాటికి 9 నెలలు పూర్తి కావస్తుందని అన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు 12వ పీఆర్సీ, డీఏ కు సంబంధించి ఆర్థిక బకాయిలు విడుదల చేయడంలో ఈ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

ప్రజాశక్తి-హిందూపురం

శ్రీ సత్యసాయి జిల్లాలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. బుధవారం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లీష్ పరీక్ష జరిగిందన్నారు. ఈ పరీక్షలో జనరల్ విద్యార్థులలో 9221 మంది విద్యార్థులకు 9045 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు.వృత్తివిద్య విద్యార్థులలో 1148మంది విద్యార్థులకు గాను 1109 మంది హాజరయ్యారని చెప్పారు. జిల్లాలోని అన్ని పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, ఎక్కడా మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రఘునాథరెడ్డి వివరించారు. ఈ పరీక్షలను జిల్లా పరీక్షల స్పెషల్ ఆఫీసర్ చెన్నకేశవ ప్రసాద్, జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు సురేష్ బాబు, రామరాజు, శ్రీనివాసరెడ్డి, డిస్ట్రిక్ట్ బల్క్ ఇన్‌ఛార్జి వెంకటేశ్వర ప్రసాద్ పరీక్షించారు.

అస్తవ్యస్తంగా ట్రాఫిక్

ప్రజాశక్తి - రొద్దం

రొద్దంలోని ప్రధాన రహదారిలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా తయారైంది. రోడ్డుపై పెద్దపెద్ద వాహనాలు అడ్డదిడ్డంగా నిలబడంతో రోడ్డుపై వెళ్లే వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం రోడ్డుకు అటువైపు ఒకటి ఇటువైపు ఒకటి వాహనాలు నిలపడంతో పెనుగొండ వైపు నుంచి వస్తున్న వాహనాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పోలీసులు స్పందించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని స్థానికిఉలు కోరుతున్నారు.



రోడ్డుపై నిలిచిపోయిన వాహనాలు

హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ లైనింగ్ పనులు నిలిపేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - బుక్కపట్నం

హంద్రీనీవా ప్రాజెక్టు కాలువ లైనింగ్ పనులు వెంటనే నిలుపుదల చేయాలని ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం మండల కేంద్రంలోని జానకంపల్లి గ్రామ సమీపంలో లైనింగ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ హంద్రీనీవా కాలవలను వెడల్పు చేయకుండా లైనింగ్ పనులు చేయడం సరికాదన్నారు. హంద్రీనీవా కాలువ మాల్యాలనుండి జీడిపల్లి వరకు ఉన్న ప్రధాన కాలువ సామర్థ్యం 3850 క్యూసెక్కులకు పరిమితం కాగా, ఈ కాల్వ పనులు చేయడానికి ప్రభుత్వం జారీ చేసిన జీవోను వెంటనే రద్దు చేయాలని తెలిపారు. మల్యాల నుంచి జీడిపల్లి వరకు పదివేల క్యూసెక్కులతో, జీడిపల్లి నుంచి గొల్లపల్లి ఓటి వరకు 6000 క్యూసెక్కులు, అక్కడ నుంచి మారాల వరకు 5000 క్యూసెక్కులు, మారాల నుండి చెర్లోపల్లి వరకు 4500 క్యూసెక్కులుగా కాలువ ప్రవాస సామర్థ్యంతో కాలువలను వెడల్పు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మడకశిర బ్రాంచ్ కెనాల్ కు 500 క్యూసెక్కుల వెడల్పు, హంద్రీనీవా మెయిన్ కాలం నుండి పిల్ల కాలువలు ఏర్పాటు చేసి రాయలసీమలోని నాలుగు జిల్లాలలో 6,02,500 ఎకరాలకు కొత్త ఆయకట్టు ద్వారా నీరు అందించాలని, జీడిపల్లి నుంచి చిత్తూరు వరకు 560 కిలోమీటర్ల కాలువ వెడల్పు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జలసాధన సమితి ఉమ్మడి జిల్లాల ప్రధాన కార్యదర్శి గంగిరెడ్డి, రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు కాసిం జలసాధన సభ్యులు నవీన్, జమీల్, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు..

చలో ఢిల్లీని విజయవంతం చేయండి

ప్రజాశక్తి-హిందూపురం

చట్టసభల్లో బీసీ కులాలకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ తరహాలో బీసీలకు కూడా ప్రత్యేక చట్టం అమలు చేయాలని నిర్వహిస్తున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్నివిజయవంతం చేయాలని బీసీ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం స్థానిక ప్రెస్ క్లబ్ లో చలో ఢిల్లీ గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా బీసీ సంఘం నాయకులు మాట్లాడుతూ, ఈ నెల 12, 13 వ తేదీల్లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా 70 కోట్లకు పైగా బీసీ జనాభా ఉన్నట్లు తెలిపారు. బీసీ కులాలకు చట్టసభలో రిజర్వేషన్లు కల్పించాలని, రూ.2 లక్షల కోట్ల నిధులతో ప్రత్యేక కేంద్ర మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని కోరారు. దీనికి తోడు న్యాయవ్యవస్థలో ఎస్సీ, ఎస్టీలకు ఏ విధంగా అయితే అట్రాసిటీ చట్టం అమలులో ఉందో అదే తరహాలో కుల దూషణ చట్టాలను బీసీ కులాలకు రూపకల్పన చేయాలని డిమాండ్ చేశారు. దక్షిణ భారతదేశ ఓబీసీ సంక్షేమ సంఘం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ సంఘం సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 12, 13వ తేదీల్లో ఢిల్లీ ఆంధ్ర భవన్ అంబేద్కర్ ఆడిటోరియంలో బీసీ మేధావుల సదస్సు తదితర కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లో అసెంబ్లీలో బీసీ బిల్లు, బీసీ జనగణన కోసం తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని కోరారు. అధిక సంఖ్యలో బీసీ నేతలు, మేధావులు చలో ఢిల్లీ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు రామచంద్ర, పార్వతమ్మ, పద్మావతి, రామకృష్ణప్ప, గంగాధరప్ప, భాస్కర్, నాగభూషణం, రామలింగప్ప తదితరులు పాల్గొన్నారు.

మంత్రి వ్యాఖ్యలు సరికాదు : యుటిఎఫ్

ప్రజాశక్తి - కదిరి టౌన్

ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా మంత్రి అచ్చెనాయుడు యుటిఎఫ్ ఉపాధ్యాయ సంఘంపై చేసిన వ్యాఖ్యలు సరికాదని ఆసంఘం జిల్లా కోశాధికారి శ్రీనివాసులు అన్నారు. సంఘానికి ఒక పార్టీ ముసుగు వేయడం ఉపాధ్యాయ ఉద్యమాన్ని అగౌరవ పరచడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. యుటిఎఫ్ ఉద్యోగ, ఉపాధ్యాయుల, విద్యా రంగ సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తోందన్నారు. అలాంటి సంఘంపై మంత్రి అనుచిత వ్యాఖ్యలు చేయడం అమానుషమన్నారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి తాహిర్ వలి, జిల్లా నాయకులు సునీల్ కుమార్, సంతోష్ కుమార్, వివిధ మండలాల నాయకులు నాగరాజు, ఖాదర్‌బాషా, రమేష్, కిషోర్, రాంప్రసాద్ నాయక్, ప్రసాద్, నిత్యానంద రెడ్డి, రమణ, హనీఫ్ తదితరులు పాల్గొన్నారు



సమావేశంలో పాల్గొన్న నాయకులు

బాల్యవివాహాల నిర్మూలన అందరి బాధ్యత

ప్రజాశక్తి - పెనుకొండ

బాల్య వివాహాలు నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని సిడిపిఒ శాంత లక్ష్మి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని వెలుగు కార్యాలయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా వారోత్సవాలు నిర్వహించారు. సందర్భంగా మత పెద్దలు దేవాలయ పురోహితులు, చర్చి ఫాస్టర్లు, ఇమామ్ లకు ,కళ్యాణ మంటపం యజమానులకు బాల్యవివాహల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ బాల్యవివాహ నిర్మూలనకు ప్రతి ఒక్కరు తమ వంతుగా కృషి చేయాలన్నారు. వివాహం జరిగే నాటికి బాలికలకు 18 సంవత్సరాలు నిండి ఉండాలని, బాలురకు 21 సంవత్సరాలు నిండి ఉండేలా చూసుకోవాలని అన్నారు. మహిళలు, బాలికల హక్కులు సాధికారత పై ఎంపీడీవో మాట్లాడుతూ బాల్యవివాహాలు చేస్తే ఎవరెవరికి ఎలాంటి చట్టపరమైన శిక్షలు ఉంటాయో వివరించారు. ఈ కార్యక్రమం చివర్లో బాల్యవివాహానిర్మూలనలో భాగంగా మతపెద్దలు అందరితో ప్రతిజ్ఞ చేయించారు. అదే విధంగా శ్రీ సత్యసాయి డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు అనురాధ, పుష్ప, ఎర్రమ్మ, మహిళా సంరక్షణ కార్యదర్శి రాధమ్మ పాల్గొన్నారు. పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మహిళా కానిస్టేబుల్ లు, వార్డ్ , గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులతో కలిసి మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు.

మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి-హిందూపురం

యువత, కష్టపడే తత్వం పెంచుకొని, ఉన్నత స్థానాల్ని అధిరోహించాలని హిందూపురం డీఎస్పీ వీకే మహేష్ కుమార్, సిడిపిఒ శాంతి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారక విభాగం ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ప్రగతి అధ్యక్షతన జరిగిన సమావేశం నిర్వహించారు. బాల్యవివాహాల వల్ల జరిగే అనర్థాలను గ్రామాల్లో వివరిస్తూ, సామాన్యులకు అవగాహన కల్పించే బాధ్యతను విద్యార్థులే తీసుకోవాలన్నారు. మహిళా చట్టాలపై ఇటీవల పోలీసు శాఖ నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలలో గెలుపొందినవారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ జి.వెంకటేసులు, సిఐ అబ్దుల్ కరీం, ఎస్ఐ శ్రీధర్, పోలీసులు, కళాశాల పూర్వ విద్యార్థి, ఉపన్యాసకులు ఎం.ఆర్ కవిత, మహిళ శిశు సంక్షేమ అభివృద్ధి శాఖ సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - మడకశిర

ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడ్ యాప్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఉచిత కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్థానిక ఎస్ వై టి ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి శ్రీనివాసులు, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులు తెలిపారు.

భూ అక్రమాలపై ధర్మవరం ఆర్డీవో విచారణ

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండలంలోని అడవి బ్రాహ్మణపల్లి తండా గిరిజనులకు చెందిన భూముల ఆక్రమణ ఆరోపణలపై ధర్మవరం ఆర్డీవో బుధవారం విచారణ నిర్వహించారు. గిరిజనులకు చెందిన భూములను ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ ఆక్రమించి తన కుటుంబ సభ్యుల, బంధువుల పేర్లతో చేయించుకున్నారని ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ధర్మవరం ఆర్డీవో మహేశ్ బుధవారం ముదిగుబ్బ మండలంలోని దొరిగల్లు, ఏబిపల్లె తండాతో పర్యటించి బాధితులతో విచారణ చేపట్టారు. స్వయాన భూముల్లోకి ఆర్డీవో వెళ్లి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నారాయణస్వామి, సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు



బాధితులతో మాట్లాడుతున్న ఆర్డీవో

8న లోక్ అదాలత్

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

ధర్మవరంలోని కోర్టు ఆవరణలో ఈ నెల 8 న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ధర్మవరం కోర్టు సీనియర్ సివిల్ జడ్జి గీతావాణి తెలిపారు. కక్షిదారులకు-రాజీ మార్గమే రాజమార్గమని ఈ లోక్ అదాలత్ ఇచ్చే తీర్పు తుది తీర్పు అవుతుందని అన్నారు. బ్యాంకు రుణాల కేసులు కూడా పరిష్కరించుకొనే అవకాశం ఉందని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

ప్రజాశక్తి - గాండ్లపెంట

మండల కేంద్రంలోని అంగన్వాడీకేంద్రంలో బుధవారం ఐసిడిఎస్ సిడిపిఒ జయంతి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. చిన్నారుల తల్లులతో సమావేశం నిర్వహించారు. బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ పద్మావతి, అంగన్వాడీలు తదితరులు పాల్గొన్నారు.

రహదారి పరిశీలన

ప్రజాశక్తి - నంబులపూలకుంట

మండల పరిధిలోని ఎగువ తూపల్లి గ్రామంలో రహదారిని తహశీల్దార్ దేవేంద్రనాయక్, మండల సర్వేయర్ బుధవారం పరిశీలించారు. దాదాపు 70 కుటుంబాలు నివాసముంటున్న ఎగువతూపల్లి దళితవాడకు రహదారి ఏర్పాటు విషయంలో వీరు గ్రామాన్ని సందర్శించారు. రైతులు సహకరిస్తే గ్రామానికి రహదారి నిర్మిస్తామని అధికారులు గ్రామస్తులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో రఘు, గ్రామ సర్వేయర్ ఉపేంద్ర, గ్రామస్తులు పాల్గొన్నారు.

పంట రుణాలు రెన్యువల్ చేసుకోండి

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

మండలంలోని గొట్లూరు పిఎసిఎస్ సింగిల్ విండో సొసైటీలో స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలు తీసుకున్న రైతులు అందరూ ఈనెల 20వ తేదీ లోపల తమ రుణాలు రెన్యువల్ చేసుకోవాలని సీఈవో నారాయణస్వామి, గొట్లూరు సొసైటీ అధికారిని లీలావతమ్మ కోరారు. సకాలంలో చెల్లించిన రైతులు ప్రభుత్వం ఇచ్చే రాయితీలను పొందాలన్నారు.

విగ్రహ ఏర్పాటుకు విరాళం

ప్రజాశక్తి-హిందూపురం

మండల పరిధిలోని కొటిపి లో నూతనంగా నిర్మించిన షిరిడి సాయిబాబా దేవాలయంలో విగ్రహ ఏర్పాటుకు ఆ గ్రామానికి చెందిన వైసిపి రాష్ట్ర సహాయ కార్యదర్శి కొటిపి హనుమంత్ రెడ్డి విరాళం అందజేశారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో శిరిడి సాయిబాబా విగ్రహం ఏర్పాటుకు తన వంతు సహాయంగా రూ.లక్షను బుధవారం గ్రామ పెద్దల సమక్షంలో ఆలయ కమిటీ ప్రతినిధులకు అందజేశారు.

రోడ్డు నిబంధనలు తప్పనిసరి

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

వాహనదారులు రోడ్డు నిబంధనలను పాటించాలని ట్రాఫిక్ ఎస్ఐ వెంకటరాముడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం పట్టణంలో వాహనాల తనిఖీ చేపట్టారు. రోడ్డు నిబంధనల గురించి అవగాహన కల్పించారు.

నూతన వాహన చట్టం పై అవగాహన

ప్రజాశక్తి - ముదిగుబ్బ

నూతన వాహన చట్టంపై వాహనదారులకు సిఐ శ్యాంరావు అవగాహన కల్పించారు. మండలంలోని కొట్టాల గ్రామంలో వాహన చోదకులతో సమావేశమై నూతన వాహన చట్టంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

ధర్మవరంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

ధర్మవరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్కిల్ హబ్ ను ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ సురేష్ బాబు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల పదో తేదిన ఇంజనీరింగ్ టెక్నికల్ సపోర్ట్ కోర్స్ తరగతులను ప్రారంభిస్తామని తెలిపారు. ఇంటర్మీడియట్ పాస్ అయిన, డిగ్రీ, పిజి కోర్సు లు చేసిన యువతి, యువకులు కళాశాలలో తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వాలి

లబ్ధిదారుల పక్షాన నిలబడి స్వాధీన ప్రక్రియ చేపడతాం
సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, వి. రాంభూపాల్



టిడ్కో గృహాల నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - కదిరి టౌన్

రాష్ట్ర ప్రభుత్వం టిడ్కో ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు ఇవ్వాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రభాకర్ రెడ్డి, రాంభూపాల్ డిమాండ్ చేశారు. కదిరిలోని హిందూపురం రోడ్డు గట్ల వద్ద అసంపూర్తిగా ఆగిపోయిన డిడ్కో గృహ నిర్మాణాలను సిపిఎం ప్రతినిధి బృందం బుధవారం పరిశీలించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2014లో టిట్కో ఇళ్ల పథకాన్ని గత తెలుగుదేశం ప్రభుత్వం చేపట్టిందన్నారు. గత వైసిపి ప్రభుత్వం జగనన్న కాలనీల పేరుతో పేదలకు ఇల్లు కేటాయిస్తామని టిడ్కో నిర్మాణాలను ఆపేసిందన్నారు. ఇప్పుడు తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు పూర్తి అవుతున్న టిడ్కో గృహనిర్మాణాలపై దృష్టి సారించలేదని విమర్శించారు. అసంపూర్తిగా ఉన్న టిడ్కో గృహాలను పూర్తిచేసి లబ్ధిదారులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వేల కోట్ల రూపాయలు పెట్టి నిర్మించిన టిడ్కో గృహ నిర్మాణ ప్రాంతాలలో కంపచెట్లు పేరుకుపోయి అడవిని తలపిస్తున్నాయన్నారు. గృహాలు అప్పగించకుండానే ఇంటి మీద అప్పు చెల్లించాలని బ్యాంకులు లబ్ధిదారుల వెంట పడుతున్నాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అనేక జిల్లాలలో టిడ్కో గృహనిర్మాణాలు అసంపూర్తిగానే ఉన్నాయన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం టిడ్కో ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని లేనిపక్షంలో లబ్ధిదారులతో కలిసి ఇళ్లను స్వాధీనం చేసుకునే కార్యక్రమానికి పూనుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జంగాలపల్లి పెద్దన్న, లక్ష్మీనారాయణ, జీఎల్. నరసింహులుతో పాటు నాయకులు జగన్, ముస్తాక్, బాబ్జాన్, రామ్మోహన్, బాబా, నరసింహప్ప, ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పించండి : వ్యకాసం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

వలసలు ఆపిఉపాధి కల్పించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాలస్వామి, కదిరప్ప డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా డ్వామా పీడీ కార్యాలయం ముందు బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలస్వామి, కదిరప్ప మాట్లాడుతూ ఉపాధి పని దినాలు పెంచాలన్నారు. గ్రామీణ పేదలు వలసలు వెళ్లకుండా 200 రోజులు ఉపాధి పని దినాలు కల్పించాలన్నారు. పని ప్రదేశాల్లో మౌలిక వసతులు కల్పించాలని, కనీస వేతనం 700 రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. కూలీలకు తగిన వేతనం ఇవ్వడం లేదని పే స్లిప్స్ ఇవ్వకపోవడంతో చేసిన పనికి ఎంత కూలి వస్తుందో కూడా తెలియడం లేదని అన్నారు. పనిముట్లు లేక ఉపాధి కూలీలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పని ప్రదేశాల్లో నీడ, నీరు, మజ్జిగ సౌకర్యం కల్పించాలన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం స్పందించి ఈ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఉపాధి హామీలో రాజకీయ జోక్యాన్ని అధికార పార్టీ నాయకుల ప్రమేయాన్ని నివారించాలన్నారు. గ్రామాలు వదిలి వలసలు వెళ్లిన వారిని తిరిగి గ్రామాలలో రప్పించి ఉపాధి హామీ పనులు కల్పించాలన్నారు. ఉపాధి హామీ చట్టంలో పనిచేసే క్షేత్రస్థాయి సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాజకీయ కారణాలతో తీసివేసిన ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలన్నారు. సిబ్బందిపై కక్ష సాధింపులు, వేధింపులు ఆపాలన్నారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని పీడీ విజయ ప్రసాద్‌కి సమర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుల్లాయప్ప, లక్ష్మీనారాయణ, చౌడప్ప, ముత్యాలప్ప, దాసు, సన్న పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

ప్రజాశక్తి - పరిగి

భూసమస్యల పరిష్కారానికి అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని ఆర్డీవో ఆనంద్‌కుమార్ ఆదేశించారు. మండలంలోని శిరికోళం వన్నంపల్లి పరిగి గ్రామాలకు చెందిన బాధితులు భూసమస్యలపై ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో పెనుగొండ ఆర్డీవో ఆనంద్ కుమార్ బుధవారం ఆయా గ్రామాల్లో పర్యటించారు. బాధితుల సమస్యలను విన్నారు. పరిగిలో కురువ సాకమ్మకు చెందిన భూమి పాస్ పుస్తకం లో తప్పిదాలు ఉండటంతో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పరిగి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. రోగులకు పంపిణీ చేస్తున్న మందులను ఆయన పరిశీలించారు. నిత్యం డాక్టర్లు రోగులకు అందుబాటులో ఉండాలని ఆస్పత్రిలో అన్ని సేవలను స్థానికులకు అందేలా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. గ్రామాల నుండి ఆరోగ్య పరీక్షలకు వచ్చే గర్భిణులకు వీలైనంతవరకు ఆసుపత్రిలోనే మెరుగైన వైద్యం అందే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ హసీనాసుల్తానా, ఎంఆర్ఐ సిద్దేశ్వర, వీఆర్వోలు గంగాధర్, రామాంజి తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో ఆనంద్ కుమార్

ఆన్‌లైన్ వేధింపులపై అప్రమత్తత అవసరం



ర్యాలీలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

కనిపించని గూగుల్ ని నమ్ముకోవడమా ప్రత్యక్షంగా కనిపించే గురువుని నమ్ముకోవడమా అనేది ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులు తెలుసుకోవలసిన అవసరం ఉందని ఆర్డీవో సువర్ణ, ల్యాండ్ అండ్ సర్వే అసిస్టెంట్ డైరక్టర్ విజయశాంతి పేర్కొన్నారు. చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్, జిల్లా మహిళ శిశు సంక్షేమ శాఖ,జిల్లా బాలల పరిరక్షణ సమితి, సంస్కృతి స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ కాలేజీ సంయుక్తంగా నిర్వహించిన సురక్షిత ఇంటర్నెట్ దినోత్సవం సందర్భంగా కాలేజీలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా సువర్ణ, విజయశాంతి హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ డిజిటల్ ట్రెడ్‌కు,సైబర్ పోకిరీలకు ప్రాంతం, పరిధి అంటూ ఉండవని అన్నారు. అన్‌లైన్ ప్రపంచంలో జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల విపరీత పరిణామాలు చోటు చేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు తమ జ్ఞాన సంపదకు, ఎదుగుదలకు మాత్రమే ఇంటర్నెట్‌ను ఉపయోగించుకోవాలన్నారు. సోషల్ మీడియా పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ సమితి అధికారి మహేష్, చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ జిల్లా సమన్వయకర్త కొండప్ప, ఎన్ఎస్ఎస్ పోగ్రాం ఆఫీసర్ ఖాదర్, ఫ్యాకల్టీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

సురక్షిత ఇంటర్నెట్ దినం సందర్భంగా ర్యాలీ : సురక్షిత ఇంటర్నెట్ దినోత్సవం సందర్భంగా చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ర్యాలీని మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ సుధావరలక్ష్మి, డిఎంహెచ్ఒ ఫిరోజాబేగం ప్రారంభించారు. విద్యార్థులు ఇంటర్నెట్ పట్ల సురక్షితంగా ఉండే విధంగా ప్లే కార్డ్స్ పట్టుకుని నినాదాలు చేశారు.

విద్యార్థులకు ఆత్మరక్షణ శిక్షణ అవసరం

ప్రజాశక్తి - కొత్తచెరువు రూరల్

ఆత్మరక్షణపై శిక్షణ ప్రతి విద్యార్థికి అవసరమని డిఇఒ కిష్టప్ప పేర్కొన్నారు. సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం కొత్తచెరువులోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా డిఇఒ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ అనుమతితో రూపేష్ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ విజయవాడ వారి ఆధ్వర్యంలో ఈ సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. బాలికలపై పెరుగుతున్న నేరాల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని వారి భద్రతను నిర్ధారించడానికి పాఠశాలల్లో వారికి ఆత్మరక్షణ శిక్షణ అందిస్తున్నామని చెప్పారు. ఆత్మరక్షణ శిక్షణ అనేది ఒక జీవిత నైపుణ్యం అనిఇది అమ్మాయిలు తమ పరిసరాల గురించి మరింత అవగాహన కలిగి ఉండటానికి ఏ సమయంలోనైనా ఊహించని వాటికి ఎదుర్కొనడానికి సిద్ధంగా ఉండటానికి సహాయపడుతుందని అన్నారు. మండల ప్రాథమికోన్నత, ఉన్నత, కస్తూరిబా గాంధీ, మోడల్ స్కూల్స్, మున్సిపల్, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్స్ ,జూనియర్ కాలేజీలుచ 6వ తరగతి నుండి 9వ తరగతి వరకు బాలికల కోసం 478 పాఠశాలల్లో 33118 మంది విద్యార్థినులకు ఇచ్చే ఈశిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ దేవరాజు, రూపేష్ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రూపేష్ బాబు, రూపేష్ సొసైటీ మాస్టర్స్ హేమంత్, ప్రిన్సిపల్స్, ఫిజికల్ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఇఒ

రైతాంగ సమస్యలపై దృష్టిసారించాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కొత్తచెరువు

కూటమి ప్రభుత్వం రైతుల సమస్యలపై మరింత దృష్టి సారించాలని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర కోరారు. బుధవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఆమె మాట్లాడారు. రాష్ట్ర సాగునీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి పలు సమస్యలను తీసుకువచ్చారు. చెరువులు నింపి పుట్టపర్తి నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయాలనే ఆలోచనతో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 2018 లో రూ. 3 కోట్ల 40 లక్షలతో (డి పీఆర్)డీటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్ కోసం నిధులు మంజూరు చేశారని గుర్తు చేశారు. తమ నియోజకవర్గంలోని ఈ 193 చెరువులతో పాటు రెండు రిజర్వాయర్లకు నీళ్ల ఇవ్వాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ద్వారా కేటాయించిన బడ్జెట్ ఎంత? ఎప్పటిలోగా పనులు పూర్తి చేస్తారో తెలపాలని ప్రశ్నోత్తరాల సమయంలో ప్రభుత్వం ద్వారా రాష్ట్ర సాగునీటి శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుని కోరారు. వీటి పనులకు రైతుల నుంచి ఎంత భూసేకరణ చేశారు, రైతులకు చెల్లించిన పరిహారం ఎంత, ఇంకా ఎంతమందికి చెల్లించాల్సి ఉంది, మిగతా పరిహారం ఎప్పటిలోగా రైతులకు చెల్లిస్తారో ప్రభుత్వం ద్వారా తెలపాలని ఎమ్మెల్యే కోరారు. హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా సాగు, తాగునీరు అందించాలన్న ఆలోచనలతో ముందుకు వెళ్తున్న ఈ ప్రభుత్వం ఏమైనా డిస్ట్రిబ్యూటర్ సెక్షన్ ఏర్పాటుకు డిపిఆర్ ప్రాజెక్టు రిపోర్టు తయారు చేశారా? వాటిని ఎప్పటిలోగా పూర్తి చేస్తారో సమగ్రంగా తెలపాలని ఈ సందర్భంగా కోరారు. కాలువలపై బ్రిడ్జి నిర్మాణాలు చేపడితే రైతులకు సౌకర్యవంతంగా ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. హంద్రీనీవా ద్వారా చెరువులు నింపడానికి కాలువల్లో స్లూయిజ్ గేట్లు ఏర్పాటు చేయాలని రాష్ట్ర సాగునీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి సభ ద్వారా ప్రత్యేకంగా కోరారు.



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూర

మధ్యంతర భృతి ప్రకటించాలి

ప్రజాశక్తి-పెనుకొండ

మధ్యంతర భృతి ప్రకటించి ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సి.నరేష్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక విఆర్.పల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఎపియస్టీఎ మండల కార్యవర్గ సమావేశాన్ని ఆసంఘం అధ్యక్షులు విజయకుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నరేష్ కుమార్ మాట్లాడుతూ 12వ పీఆర్సీ కమిటీ ఆలస్యమవుతున్నందు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వెంటనే ముప్పై శాతం మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించి పిఆర్‌సి, పెండింగ్ డిఎ బకాయిలు చెల్లించాలని, భవిష్యనిధి,ఎపిజిఎల్ఐ లోన్లు, సరెండర్ లీవ్ మొత్తాలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. మోడల్ ప్రాథమిక పాఠశాలల ఏర్పాటు పేరుతో సమీప పాఠశాలలను విలీనం చేయడాన్ని, ప్రాథమికోన్నత పాఠశాలలను రద్దు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. గ్రామీణ పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి అందుబాటులో పాఠశాలలు ఉండాలని పాఠశాలల బలవంతపు విలీనాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మండల అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు యన్.విజయకుమార్, హెచ్.బాబు, జిల్లా కౌన్సిలర్ డి.శ్రీనివాసులు, రాజేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని సిపిఐ కాలనీలో నివాసం ఉంటున్న సోమశేఖర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు... సోమశేఖర్ తాగుడుకు బానిసై తన భార్యతో తరచుగా గొడవ పడుతూ ఉండేవాడు. ఈ క్రమంలో భార్య ఇదే విధంగా గొడవ పడుతూ ఉంటే పోలీస్ స్టేషన్ కు వెళ్లి ఫిర్యాదు చేస్తానని ఆమె హెచ్చరించింది. దీంతో సోమశేఖర్ ఇంటిలో గడియ పెట్టుకొని ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన బంధువులు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు సోమశేఖర్ అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఈ సంఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

పేకాట జూదరులు అరెస్టు

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైం

మండల పరిధిలోని కర్ణాటక నాగేపల్లి గ్రామ శివారులో సాహెబ్ చెరువు గుట్టలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ లింగన్న తెలిపారు. ఈ దాడుల్లో ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ 51,530 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

దాణా దుకాణంలో చోరీ

ప్రజాశక్తి - కొత్తచెరువు

మండలకేంద్రంలోని పెనుగొండ రోడ్డు జూనియర్ కళాశాల ముందర ఉన్న అంజన శక్తి దాణా దుకాణాల్లో బుధవారం మధ్యాహ్నం చోరీ జరిగింది. ప్రతాప్ రెడ్డి నిర్వహిస్తున్న దాణా దుకాణంలో బుధవారం మధ్యాహ్నం అతని తల్లి సావిత్రమ్మ దుకాణంలో ఉంది. ఆ సమయంలో గుర్తు తెలియని వ్యక్తి దుకాణం లోకి ప్రవేశించి చిల్లర డబ్బులు ఇవ్వాలని ఆమెని కోరాడు. దీంతో ఆమె పర్సు తీసి డబ్బులు ఇస్తుండగా ఆ వ్యక్తి పర్సుని లాక్కొని అక్కడి నుండి పారిపోయారు. ఇందులో 15 వేల రూపాయలు డబ్బులున్నట్లు ఆమె తెలిపారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశామని బాధితులు చెప్పారు.

భార్యాభర్తల మధ్య మనస్పర్థలు

కుమారుడితో పాటు భర్త ఆత్మహత్యాయత్నం
సాంకేతిక పరిజ్ఞానంతో ప్రాణాలు కాపాడిన పోలీసులు

ప్రజాశక్తి-హిందూపురం

భార్యాభర్తలు గొడవ పడ్డారు. భార్యపై ఆగ్రహానికి గురైన భర్త తన కుమారుడిని తీసుకొని ఆత్మహత్య చేసుకునేందుకు రైలు పట్టాలపైకి వెళ్ళాడు. ఇంతలోనే పోలీసులు అక్కడికి వెళ్లి వారిని రెప్పపాటున కాపాడారు. ఇది ఏదో సినిమా అనుకుంటున్నారా.. కాదు అక్షరాల నిజం. అచ్చం సినిమాని తలపించేలా ఈ సంఘటన హిందూపురం రైల్వే స్టేషన్‌లో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి శ్రీ సత్యసాయి జిల్లా పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. హిందూపురం సమీపంలోని సేవా మందిరానికి చెందిన నాసిర్ ఖాన్ అతని భార్య రూబియాతో స్థానిక ముక్కడిపేటలోని ఇంటిలో మంగళవారం రాత్రి గొడవపడ్డారు. దీంతో మనస్థాపానికి గురైన నాసిర్ ఖాన్ తన ఆరు సంవత్సరాల కుమారుడు అయాన్ ఖాన్‌ను వెంట తీసుకుని చనిపోవడానికి వెళుతున్నామని చెప్పి వెళ్లిపోయాడు. దీంతో తీవ్ర ఆందోళనకు గురైన రూబియా వెంటనే 100 కాల్ చేసి విషయం తెలిపింది. స్పందించిన ఎస్‌పి. వి.రత్న స్థానిక పోలీసులను అప్రమత్తం చేశారు. హిందూపురం వన్ టౌన్ సిఐ సూచనలతో పోలీస్ బృందాలను రంగంలోకి దిగాయి. పోలీసులు నాలుగు బృందాలుగా ఏర్పడి ఎస్ఐ శ్రీధర్, ఏఎస్ఐ వెంకటరమణ, హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్, బ్లూ కోట్స్ పోలీసులు జగన్నాథ నాయక్, స్పెషల్ పార్టీ కానిస్టేబుల్‌తో పాటు, పరిగి ఎస్ఐ రంగడు గాలింపు చర్యలు చేపట్టారు. సాంకేతిక పరిజ్ఞానంతో నాసిర్ ఖాన్ కుమారుడితో కలిసి ఎక్కడ ఉన్నారన్న విషయాన్ని గుర్తించారు. మొబైల్ లొకేషన్ ఆధారంగా ఆచూకీ తెలుసుకున్నారు. మంగళవారం రాత్రి 10:40 గంటల సమయంలో హిందూపురం రైల్వే స్టేషన్ దగ్గర గల రైల్వే ట్రాక్ పై ఉన్నట్లు లొకేషన్ ద్వారా పసిగట్టారు. రైలు వస్తుండగా నాసిర్ ఖాన్ తన కుమారుడితో పాటు ట్రాక్ పై ఉన్న విషయాన్ని గమనించి వెంటనే అక్కడ చేరుకున్న బ్లూ కోట్స్ కానిస్టేబుల్ జగన్నాథ నాయక్, స్పెషల్ పార్టీ కానిస్టేబుల్ అక్కడికి వెళ్లి వెంటనే వారిని పక్కకు లాగారు. దీంతో రెప్పపాటులో ఇద్దరి ప్రాణాలను కాపాడారు. వెంటనే తండ్రి, కుమారుడిని హిందూపురం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ తీసుకువచ్చి కౌన్సిలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు. సమాచారం అందుకున్న వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని రెండు నిండు ప్రాణాలను కాపాడిన హిందూపురం పోలీసులను, హిందూపురం టౌన్ పోలీస్ బృందాన్ని ఎస్పీ వి.రత్న అభినందించారు. తన కుమారుడి, భర్త ప్రాణాలు కాపాడిన పోలీసులకు రుబియాతో పాటు వారి బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.

మంగళకర విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

మండల పరిధిలోని జగరాజుపల్లిలోని మంగళకర డిగ్రీ కళాశాలలో బికాం. ద్వితీయ సంవత్సరం చదువుచున్న శ్రీనాథ్ సౌత్‌జోన్ ఇంటర్‌యూనివర్సిటీ టోర్నమెంట్‌లో పాల్గొన్నారు. తమిళనాడు రాష్ట్రంలోని సేలంలోని పెరియార్ యూనివర్శిటీలో జరిగిన సౌత్ జోన్ ఇంటర్ యూనివర్శిటీ హ్యాండ్ బాల్ టోర్న మెంటులో ఎస్కేయునివర్సిటీ జట్టు తరపున పాల్గొన్నారు .ఈ సందర్భంగా మంగళకర విద్యా సంస్థల మేనేజింగ్ ట్రస్టీ సురేష్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ట్రస్ట్ ఆర్యప్రకాష్, ఎఒ జయ చంద్రారెడ్డి, మంగళకర ,డిగ్రి కళాశాల ప్రిన్సిపల్ రమేష్ బాబు , అధ్యాపకులు శ్రీనాథ్‌ను అభినందించారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కొత్తచెరువు

సమగ్ర శిక్షణ అవుట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఆసంఘం జిల్లా అధ్యక్షులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బుధవారం సాయంత్రం స్థానిక ఎంఇఒ కార్యాలయం వద్ద బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మె కాలపు ఒప్పందాలను వెంటనే అమలు చేయాలని మినిమం టైం స్కేల్ ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంఇఒ జయచంద్రకు వినతి పత్రం సమర్పించారు.

కామన్ పీజీ ఎంట్రెన్స్ విధానాన్ని రద్దు చేయాలి

ప్రజాశక్తి-హిందూపురం

విద్యార్థులకు శాపంగా మారిన గత ప్రభుత్వం తీసుకొచ్చిన కామన్ పీజీ ఎంట్రన్స్ టెస్ట్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు నరసింహమూర్తి డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలపై ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం నిరసన వ్యక్తం చేసి తహశీల్దార్ వెంకటేష్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వల్ల యూనివర్సిటీ కేంద్రంలో విద్యార్థులు లేక కొన్ని విభాగాలను మూసివేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. అదే విధంగా జీవో నెంబర్.77ను తీసుకురావడం వల్ల దాదాపు 10 లక్షల మంది విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతూ ఆవేదనకు గురవుతున్నారని తెలిపారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

కోర్టు ప్రాంగణంలో తాగునీటి సౌకర్యం

ప్రజాశక్తి - పెనుకొండ

స్థానిక కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు వాల్మీకి శ్రీనివాసులు ఆధ్వర్యంలో సీనియర్ సివిల్ జడ్జి చేతుల మీదుగా తాగునీటి సౌకరాన్ని బుధవారం ప్రారంభించారు. ఏర్పాటు చేశారు. కక్షిదారుల కోసం వేసవిని దృష్టిలో ఉంచుకొని బ్లూ స్టార్ వాటర్ డిస్పెన్సెర్‌తో చల్లని నీరు సదుపాయం కల్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జీ వాసు దేవన్, జూనియర్ సివిల్ జడ్జీలు ముజీబ్ పసఫల, బొజ్జప్ప, న్యాయవాదులు నారాయణ, శివశర్మ, వైఎస్ఆర్సీపీ లీగల్ సెల్ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ నాగరాజు, నాగిరెడ్డి, జావేద్, గౌతమి, హరీష్, నాగేంద్ర, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.